

పత్తి క్వింటాల్‌కు రూ.6,710

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మార్కెట్‌యార్డులో శుక్రవారం పత్తి క్వింటాల్‌కు గరిష్ట ధర రూ.6,710, కనిష్టం రూ.5,615, సరాసరి ధర రూ.6,290 పలికింది.



సమర్థవంతంగా పని చేయాలి

మహిళా పోలీసులు సమర్థవంతంగా పని చేయాలని సీపీ రెమా రాజేశ్వరి పేర్కొన్నారు. మహిళా హోంగార్డ్ నుంచి ఎస్సై స్థాయి అధికారులకు శిక్షణ ప్రారంభించారు. 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 33.0/25.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. బలమైన ఈదురుగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలి



రికార్డులు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ అరుణశ్రీ

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): గ్రామాభివృద్ధిలో ప్రజాప్రతినిధులు, అధికారులు భాగస్వాములు కావాలని అదనపు కలెక్టర్ అరుణశ్రీ అన్నారు. సుల్తానాబాద్ మండలం చిన్నబొంకూర్, మియ్యాపూర్ గ్రామాల్లో శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా చిన్నబొంకూర్– రెబ్బల్‌దేవ్‌పల్లి మధ్య ఇటీవల వర్షాలకు దెబ్బతిన్న కల్వర్టును పరిశీలించారు. అలాగే గ్రామాల్లోని వైకుంఠధామాలు, నర్సరీలు, పాఠశాలలు, పల్లె ప్రకృతి వనాలను సందర్శించి మాట్లాడారు. వర్షాలకు దోమలు బాగా వృద్ధి చెంది ప్రజలు రోగాల బారిన పడుతున్నారని, రోజూ క్లోరినేషన్, బ్లీచింగ్ చేస్తూ మురికికాల్వలు శుభ్రంగా ఉండేలా చూడాలని అధికారులకు సూచించారు. ఆమె వెంట సర్పంచ్‌లు రాజు, స్వప్న, డీపీఓ చంద్రమౌళి, డీఎల్‌పీఓ శివయ్య, ఎంపీడీఓ శశికళ, ఎంపీఓ ఫయాజ్‌అలీ, కార్యదర్శి నిశాంత్ తదితరులున్నారు.

నేడు న్యాయవిజ్ఞాన సదస్సు

గోదావరిఖనిటౌన్(రామగుండం): మండల న్యాయసేవ అధికారిక సంస్థ ఆధ్వర్యంలో శనివారం ఉదయం రామగుండం నగరపాలక సంస్థ పరిధి సంజయ్‌నగర్‌లో న్యాయవిజ్ఞాన సదస్సు, ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు గోదావరిఖని అదనపు జిల్లా న్యాయమూర్తి, మండల న్యాయ సేవ అధికారిక సంస్థ చైర్మన్ డాక్టర్ టి.శ్రీనివాసరావు తెలిపారు. న్యాయ విజ్ఞాన సదస్సుతోపాటు ఉచిత వైద్య శిబిరాన్ని స్థానికులు వినియోగించుకోవాలని కోరారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి



నిరసన దీక్షలో పంచాయతీ కార్మికులు

పెద్దపల్లిరూరల్: పంచాయతీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించి, పనికి తగ్గ వేతనాలు పెంచాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు భిక్షపతి అన్నారు. పెద్దపల్లిలోని అమరవీరుల స్తూపం వద్ద 30రోజులుగా నిరవధికసమ్మె చేస్తున్నా పాలకులు పట్టించుకోకపోవడం సరికాదన్నారు. మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలని, కారోబార్లకు పదోన్నతి కల్పించాలని కోరారు. నాయకులు జి.జ్యోతి, యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ఖాజా, తిరుపతి, రాజయ్య, నరేష్, కనుకయ్య, అశోక్, శంకరమ్మ, ప్రభాకర్, శారద, అనిల్, రాజ మొగిలి, పరుశరామ్, రాజయ్య, సత్యనారాయణ, శేఖర్, నర్సయ్య, శ్రీకాంత్, మల్లేష్, మహేందర్, నాగరాజు, సందీప్ సంపత్, రాజేశం, గోపాల్, ప్రణయ్ తదితరులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధి శిక్షణను వినియోగించుకోవాలి



కరపత్రం ఆవిష్కరిస్తున్న రఘువీర్‌సింగ్, తదితరులు

జూలపల్లి(పెద్దపల్లి): నిరుద్యోగ యువతీయువకులు ప్రతిమ ఫౌండేషన్ ద్వారా అందజేస్తున్న ఉచిత ఉపాధి శిక్షణ కోర్సులను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రంథాలయ చైర్మన్ రఘువీర్‌సింగ్ సూచించారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృత్తి విద్య కోర్సుల కరపత్రాలను శుక్రవారం మండల కేంద్రంలో ఆవిష్కరించి మాట్లాడారు. ఉచిత శిక్షణతో పాటు వసతి సౌకర్యాలు కల్పిస్తున్నందున నిరుద్యోగులు ఉపయోగించుకొని స్వయం ఉపాధి పొందాలని కోరారు. కార్యక్రమంలో ఫౌండేషన్ కోఆర్డినేటర్ గుంటి శంకర్, నాయకులు పోలగాని సతీష్, ఇలియాస్ అంకూస్, కల్లెపల్లి లింగయ్య, మేరు శ్రీనివాస్, తాజొద్దీన్, గంగిపెల్లి శ్రీనివాస్, బాణాల కొమురయ్య తదితరులు ఉన్నారు.

వీఆర్‌ఏల సర్దుబాటుకు పోస్టులు మంజూరు

పెద్దపల్లిరూరల్: గ్రామ రెవెన్యూ సహాయకుల (వీఆర్‌ఏ) సర్దుబాటు కోసం రాష్ట్ర ప్రభుత్వం వివిధ విభాగాల్లో కొత్తగా పోస్టులను మంజూరు చేసింది. ఇందులో భాగంగా జిల్లాలోని వీఆర్‌ఏల సేవలను వినియోగించుకునేందుకు రెవెన్యూ శాఖలో 64 జూనియర్ అసిస్టెంట్ పోస్టులు, 71 రికార్డు అసిస్టెంట్స్, 39 సబార్డినేట్స్ పోస్టులను, నీటిపారుదలశాఖలో లష్కర్స్‌గా 50 పోస్టులు, హెల్పర్లుగా 46, మిషన్ భగీరథలో 78 పోస్టులు మంజూరయ్యాయి.

మూఢనమ్మకం.. మంత్రాల భయం..!



“ ‘రామగుండం కార్పొరేషన్ పరిధిలో ఉన్నత చదువులు చదివిన ఓ ప్రభుత్వ ఉద్యోగి ఏదీ కలిసిరావడం లేదని, కీడు సోకిందని ఎవరో బాబా చెప్పడంతో మూఢనమ్మకంతో సూర్యోదయం తర్వాత ఇంటి వాకిట్లో కల్లాపి చల్లకుండానే కుటుంబ సభ్యులతో కలిసి బయటకు వెళ్లిపోయాడు. నెలరోజులు కిరాయి ఇంట్లో బసచేశాడు. ఇలా నిరాక్షరాస్యులు, అక్షరాస్యులు అనే తేడా లేకుండా మూఢనమ్మకాలతో ఒళ్లు గుల్లచేసుకుంటూ ఇబ్బందులు పడుతున్నవారు చాలామంది ఉన్నారు’.

“ ‘ఈచిత్రంలో కనిపిస్తున్నది కాల్వశ్రీరాంపూర్ మండలం చిన్నరాతుపల్లి క్రాస్‌రోడ్డులో జరిగిన క్షుద్రపూజ ఆనవాళ్లు. చిన్నరాతుపల్లి, మొట్లపల్లి గ్రామాలకు వెళ్లే కూడలిలో నిమ్మకాయలు, పసుపు, కుంకుమ ఉంచి పందిని కోసి తల, మొండెం వేరు చేశారు. మరో చోట కోడిని కోసి పెట్టారు. దీంతో ఆ గ్రామాలకు రాకపోకలు సాగించేవారు భయాందోళనకు గురయ్యారు’

- వ్యాధులు, దోషాల నివారణ పేరిట క్షుద్రపూజలు
- రోడ్లు, శివారు ప్రాంతాల్లో చేతబడి ఆనవాళ్లు
- కానరాని చైతన్య కళాజాత కార్యక్రమాలు
- అవగాహన లేకపోవడమే ప్రధాన కారణం

సాక్షి, పెద్దపల్లి: శాస్త్ర సాంకేతిక రంగం ఎంతో అభివృద్ధి చెంది చంద్రుని మీదకు సైతం కాలు పెట్టేందుకు ప్రయోగాలు చేస్తున్నా.. నేటికీ నాలుగు బాటల మధ్య ఉన్న నిమ్మకాయలను చూసి భయపడే పరిస్థితి జిల్లాలోని చాలా ప్రాంతాల్లో నెలకొంది. అక్షరాస్యతలో ఎంతో వృద్ధి చెందుతున్నా ఇప్పటికీ నేలపైన రాజ్యమేలుతున్నా మూఢవిశ్వాసాలు జిల్లాలో ఎక్కడో చోట కనిపిస్తూ చేతబడి ఆనవాళ్లు భయపెడుతున్నాయి. గ్రామం, పట్టణం అనే తేడా లేకుండా ఇప్పటికీ మూఢనమ్మకాలు ప్రజలను పట్టి పీడిస్తున్నాయి. ప్రత్యేక రోజులు, ఆదివారాల్లో నాలుగు బాటల వద్ద రాత్రి అయితే చాలు ఆయా ఆనవాళ్లు కనిపిస్తూ కలవరపెడుతున్నాయి. నమ్మకం అనేది మనిషి ఎదుగుదలకు పునాదిలాంటిది. మూఢనమ్మకం అనేది మనిషి ఎదుగుదలకు అడ్డుగోడలాంటిదనే విషయం తెలియక మూఢనమ్మకాలనే చట్రంలో ఇరుక్కొని నలిగిపోతున్నారు.


మంత్రగాళ్ల వద్దకే పరుగులు

కుటుంబసభ్యుల్లో ఎవరికైనా ఆరోగ్యం బాగోలేకపోయినా, ఇంటిలో పరిస్థితులు ఇబ్బందికరంగా ఉన్నా చేతబడి లేదా చిల్లంగి అనాచారాల పేరుతో నాటు వైద్యులు, మంత్రగాళ్లను ఆశ్రయించి ఒళ్లు గుల్ల చేసుకుంటున్నారు. గురువారం, ఆదివారం, పౌర్ణమి, అమావాస్య తదితర రోజుల్లో ఈ పూజలు ఎక్కువగా చోటుచేసుకుంటున్నాయి. మంత్రాలు చేయడం వల్లే తమ కుటుంబసభ్యులు అనారోగ్యాల బారినపడుతున్నారనే అనుమానంతో గ్రామాల్లో దాడులు నిత్యకృత్యమవుతున్నాయి. దీంతో పచ్చని పల్లెల్లో అశాంతి, అలజడి చోటు చేసుకుంటుంది.

కానరాని కళాజాత కార్యక్రమాలు

మూఢనమ్మకాలు, విశ్వాసాలపై పోలీస్‌శాఖ తరఫున గ్రామాల్లో గతంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించేవారు. ఎవరైనా వ్యాధుల బారిన పడితే భూతవైద్యుల వద్ద చికిత్స తీసుకోవద్దని, వైద్యులను సంప్రదించాలని సూచించేవారు. అయితే నేడు ఎక్కడా కళాజాత కార్యక్రమాల నిర్వహణ లేకపోవడంతో చాలా మంది నాటు వైద్యం, మూఢనమ్మకాలకు ప్రాధాన్యం ఇస్తూ ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. వీటి నిర్మూలనకు గ్రామాల్లో వైద్యసౌకర్యాలు పెంచడంతో పాటు మానసిక సమస్యలతో బాధపడే వారికి వైద్య సహాయం అందిస్తూ, సామాజిక కార్యకర్తలు, మానసిక వైద్యునిపుణుల సహాయంతో సైన్స్ ప్రాధాన్యాన్ని తెలిపేలా కార్యక్రమాలు చేపట్టాల్సి ఉంది. అలాగే చేతబడిలాంటి పూజలు చేస్తామనే వారిని గుర్తించి వారిని చట్టప్రకారం శిక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.


అవగాహన కల్పిస్తాం



జిల్లాలో బాణామతి తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తాం. గతంలో పోలీస్‌వారి చేత కళాజాత కార్యక్రమాలు నిర్వహించేవాళ్లం. అయితే కరోనా, తదితర పరిస్థితుల నేపథ్యంలో కొంత యాక్టివ్‌నెస్ తగ్గింది. వాటిని ప్రతీ పల్లెలో నిర్వహించి ప్రజలను శాస్త్రీయ దృక్పథం వైపు మళ్లించేందుకు ప్రయత్నిస్తాం.

– వైభవ్ గైక్వాడ్, డీసీపీ


శాస్త్రీయత లోపమే కారణం



విద్యార్థులకు సైన్స్ పాఠాలు బోధిస్తున్నా, వారికి శాస్త్రీయత అంశాలపై అవగాహన కల్పించడం లేదు. అక్షరాస్యత పెరుగుతున్నా మూఢనమ్మకాలు మన సమాజాన్ని వీడటం లేదు. ఆచారాలు, సంప్రదాయాలు మనిషిని మూఢనమ్మకాలలో బందీని చేస్తున్నాయి.

– జీడీ సారయ్య, భారతనాస్తిక సమాజం జాతీయ అధ్యక్షుడు

మానసిక బలహీనులే నమ్ముతారు



మానసికంగా బలంగా లేనివారు తమపై మంత్రాలు చేశారని లేదా తమకు శక్తులున్నాయని కొందరు నమ్ముతారు. సైకోఫ్రోనియా అనే మానసిక రుగ్మతతో బాధపడే వారిలో మూఢనమ్మకాలు ఉంటాయి. డోపమైన్ అనే రసాయనం ఎక్కువగా విడుదల కావడమే ఇందుకు కారణం. మానసిక వైద్యుల వద్ద చికిత్స తీసుకుంటే వారి సమస్యలు తగ్గిపోతాయి.

– ప్రదీప్, మానసిక వైద్య నిపుణుడు

పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరికి హైకోర్టు నోటీసులు

- దేవాలయ భూముల రికార్డుల మార్పుపై దాఖలైన పిటిషన్‌లో విచారణ

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డితోపాటు ఆయన బంధువులు కొందరు దేవాలయ భూములను తమ పేరిట అక్రమంగా మార్చుకున్నారంటూ పిటిషన్ దాఖలవడంతో వారికి హైకోర్టు నోటీసులు జారీచేసింది. తదుపరి విచారణలోగా కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ విచారణను ఈ నెల 31వ తేదీకి వాయిదా వేసింది. పెద్దపల్లి మండలం పాలితంలోని శ్రీ రంగనాయకస్వామి దేవాలయ భూములను ఎమ్మెల్యే, ఆయన బంధువులు తమ పేరిట మార్చుకున్నారని, రెవెన్యూ రికార్డుల నుంచి వారి పేర్లను తొలగించేలా అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ పెద్దపల్లికి చెందిన రాజేశ్ పటేల్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. వాటిని తిరిగి దేవాదాయ భూములుగా పునరుద్ధరించాలని పిటిషన్‌లో కోరారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి విచారణ చేపట్టగా, పిటిషనర్ తరఫున న్యాయవాది రాపోలు భాస్కర్ వాదనలు వినిపించారు. రాష్ట్రంలోని దేవాదాయ భూములను సంరక్షించాల్సిన అవసరం ఉందని, వాటిని ఆక్రమించినవారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని న్యాయవాది కోరారు. ఆ భూములను దేవాదాయ శాఖకు గానీ, పేదలకుగానీ ఇచ్చేలా ఆదేశాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. వాదనలు విన్న ధర్మాసనం మనోహర్‌రెడ్డితోపాటు ఆయన బంధువులకు వ్యక్తిగత నోటీసులు జారీ చేసింది.

8లోగా దరఖాస్తు చేసుకోవాలి

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని మున్సిపాలిటీల్లో మహిళా సంఘాల రికార్డులను ఆడిట్ చేసేందుకు ఆసక్తిగల ఆడిటర్లు ఈనెల 8లోగా దరఖాస్తు చేసుకోవాలని స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ కోరారు. రామగుండం కార్పొరేషన్‌తో పాటు పెద్దపల్లి, సుల్తానాబాద్, మంథని మున్సిపాలిటీలలోని స్వయం సహాయక సంఘాలు, పట్టణ సమాఖ్యలకు సంబంధించిన రికార్డులను ఆడిట్ చేయాల్సి ఉందని పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత, అనుభవం కలిగిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఆడిటర్లు పూర్తి వివరాలతో పాటు తగిన ధ్రువీకరణ పత్రాలను దరఖాస్తుకు జతపర్చాలన్నారు. మెప్మా కార్యాలయంలో దరఖాస్తులను అందించాలని, మరిన్ని వివరాలకు 99083 92577 నంబరులో సంప్రదించాలని పేర్కొన్నారు.

సర్వే ప్రకారమే ఎమ్మెల్యే టికెట్

- నాయకులందరూ పార్టీకి లోబడి వ్యవహరించాలి
- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- చల్లబడిన రామగుండం అసమ్మతి నేతలు



మంత్రి ఈశ్వర్‌కు మొక్క అందజేస్తున్న అసమ్మతి నేతలు

గోదావరిఖని(రామగుండం): నియోజకవర్గాల్లో సర్వేలు కొనసాగుతున్నాయని, వాటి ప్రకారమే ఎమ్మెల్యే టికెట్ కేటాయింపు ఉంటుందని అప్పటివరకు అందరూ కలిసి పార్టీకోసం పనిచేయాలని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. శుక్రవారం అసెంబ్లీలోని తన కార్యాలయంలో రామగుండం అసమ్మతి నేతలతో సుదీర్ఘంగా సుమారు 3 గంటల పాటు భేటీ అయ్యారు. ఈసందర్భంగా అసమ్మతి నాయకుల ద్వారా వివరాలు తెలుసుకున్నారు. గడిచిన నాలుగేళ్లుగా ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ద్వారా పడుతున్న ఇబ్బందులను ఐదుగురు నేతలు కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. వారి సమస్యలను ఓపికగా విన్న తర్వాత కేటీఆర్ మాట్లాడారు. సోషల్ మీడియా, ఇంటెలిజెన్స్ నివేదికల ద్వారా ఎప్పటికప్పుడు సమాచారం తెప్పించుకుంటున్నానని, ఈ సమయంలో ఏలాంటి కార్యక్రమాలు చేసినా పార్టీకి ఇబ్బంది ఎదురవుతుందన్నారు. సర్వేలో ఎవరికి అనుకూలంగా వచ్చినా వారికే టికెట్ కేటాయిస్తామన్నారు. వ్యక్తులు ముఖ్యం కాదని పార్టీకే ప్రాధాన్యం ఉంటుందని వెల్లడించారు. రామగుండం నియోజకవర్గ ఇన్‌చార్జిగా మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు బాధ్యతలు అప్పగించారు. సమావేశంలో రాష్ట్ర మంత్రులు కొప్పుల ఈశ్వర్, గంగుల కమలాకర్, విప్ బాల్క సుమన్, డిప్యూటీ స్పీకర్ పద్మారావు, అసమ్మతి నాయకులు కందుల సంధ్యారాణి, మిర్యాల రాజిరెడ్డి, కొంకటి లక్ష్మీనారాయణ, బయ్యపు మనోహర్‌రెడ్డి, పాతిపెల్లి ఎల్లయ్య ఉన్నారు. అంతకముందు మంత్రి ఈశ్వర్‌కు అసమ్మతి నేతలు మొక్క అందజేసి ఆయనతో భేటీ అయ్యారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలి

- డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్



వివరాలు తెలుసుకుంటున్న డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్

కమాన్‌పూర్(మంథని): వర్షాలు తగ్గుముఖం పట్టిన నేపథ్యంలో గ్రామాల్లో ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా వైద్య సిబ్బంది తగు చర్యలు చేపట్టాలని డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని నాగారం గ్రామంలో కమాన్‌పూర్ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో హెల్త్ క్యాంపు ఏర్పాటు చేయగా డీఎంహెచ్‌వో సందర్శించారు. ఇటీవల గ్రామానికి చెందిన ఇద్దరికి డెంగీ నిర్ధారణ కావడంతో హెల్త్ క్యాంపు ఏర్పాటు చేశారు. జ్వర పీడుతుల నుంచి రక్త నమూనాలు సేకరించి పరీక్షలకు పంపించారు. క్యాంపు సందర్శన అనంతరం గ్రామంలో చేపడుతున్న పారిశుధ్య పనులు డీఎంహెచ్‌వో పరిశీలించారు. ప్రజలు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఆయన వెంట కమాన్‌పూర్ పీహెచ్‌సీ వైద్యాధికారి అశోక్‌కుమార్, వైద్య సిబ్బంది ఉన్నారు.

రెండోదశలో 240 మెగావాట్ల సోలార్ విద్యుత్

- సోలార్ ప్లాంట్లకు వచ్చేనెలలో టెండర్లు
- అక్టోబర్ నుంచి నిర్మాణాలు ప్రారంభించాలి
- సింగరేణి సీఅండ్‌ఎండీ ఎన్.శ్రీధర్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సీఅండ్‌ఎండీ ఎన్.శ్రీధర్

గోదావరిఖని(రామగుండం): సోలార్ విద్యుత్ ఉత్పాదన రంగంలో విజయవంతంగా ముందుకు పోతున్న సింగరేణి రెండో దశ సోలార్ ప్లాంట్ల నిర్మాణానికి సిద్ధమైంది. 240 మెగావాట్ల సామర్థ్యంతో 8 ఏరియాల్లో ప్లాంట్లు నెలకొల్పడానికి రంగం సిద్ధం చేస్తోంది. సంస్థ వ్యాప్తంగా 8 ఏరియాల్లో చేపట్టనున్న సోలార్ ప్లాంట్లకు సంబంధించిన విధివిధానాలను ఖరారు చేసి వచ్చే నెలలో టెండర్లు పిలవాలని, అక్టోబర్ నుంచి నిర్మాణాలు ప్రారంభించాలని సంస్థ సీఅండ్‌ఎండీ ఎన్.శ్రీధర్ ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్ సింగరేణిభవన్‌లో నిర్వహించిన విద్యుత్ సమీక్ష సమావేశంలో మాట్లాడారు. మొదటి దశ 300 మెగావాట్ల ప్లాంట్లలో ఇంకా మిగిలిన 76 మెగావాట్ల సామర్థ్యం గల ప్లాంట్లను అక్టోబర్ వరకు పూర్తి చేయాలన్నారు. 240 మెగావాట్ల ప్లాంట్లను వచ్చే ఏడాది అక్టోబర్ వరకు నిర్మాణం పూర్తి చేసి ప్రారంభించుకోవాలన్నారు. తద్వారా మొత్తం 540 మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పాదనతో కంపెనీని నెట్ జీరో కార్బన్ ఎమిషన్ కంపెనీగా నిలపడానికి ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా కృషిచేయాలని పిలుపునిచ్చారు.

8 ఏరియాల్లో కొత్త సోలార్ ప్లాంట్లు

సంస్థవ్యాప్తంగా 8 ఏరియాల్లో కొత్త సోలార్ ప్లాంట్లు నిర్మించడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. మందమర్రిలో 67.5, ఆర్జీ–3లో 41 , సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రంలో 37.5, సత్తుపల్లిలో తొలిసారిగా 32.5, శ్రీరాంపూర్ ఏరియాలో తొలిసారిగా 27.5, ఇల్లెందులో 15, భూపాలపల్లి ఏరియాలో 10, ఆర్జీ–1 ఏరియాలో తొలిసారిగా 5 మెగావాట్ల ప్లాంట్లను నెలకొల్పాలని నిర్ణయించారు. వచ్చే నెలలో టెండర్లు పిలిచి నిర్మాణ ఏజెన్సీలను ఖరారు చేయనున్నారు. అలాగే థర్మల్ విద్యుత్ కేంద్రం పనితీరుపై కూడా సీఅండ్‌ఎండీ సమీక్షించారు. ఇటీవలే క్యాపిటల్ ఓవర్ హాలింగ్ జరుపుకున్న ఈ కేంద్రం తిరిగి అత్యుత్తమ స్థాయిలో విద్యుత్ ఉత్పాదన చేస్తూ మంచి పీఎల్‌ఎఫ్ సాధించడానికి కృషి చేయాలని అధికారుల్ని ఆదేశించారు. ప్లాంట్ ఆవరణలో పర్యావరణహిత నిర్మాణం ఎఫ్‌జీడీని వచ్చే ఏడాది సెప్టెంబర్ నాటికి పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో డైరెక్టర్ డి.సత్యనారాయణరావు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

జిల్లాలో 77 మద్యం దుకాణాలు

- తొలిరోజు నాలుగు దరఖాస్తుల స్వీకరణ
- 18 వరకు అర్జీలకు గడువు
- జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ మహిపాల్‌రెడ్డి



దరఖాస్తు స్వీకరిస్తున్న ఎక్సైజ్ సూపరింటెండెంట్ మహిపాల్‌రెడ్డి

పెద్దపల్లిరూరల్: జిల్లాలో 77 మద్యం దుకాణాల ఏర్పాటుకు నోటిఫికేషన్ జారీ చేశామని, ప్రభుత్వాదేశాల మేరకు రిజర్వేషన్ ప్రక్రియను కలెక్టర్ సమక్షంలో పూర్తి చేసినట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ మహిపాల్‌రెడ్డి తెలిపారు. పెద్దపల్లిలోని తన కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో గౌడ కులస్తులకు 15శాతం రిజర్వేషన్ ప్రకారం 13 దుకాణాలు, ఎస్సీలకు 10శాతం రిజర్వేషన్ మేరకు 8 దుకాణాలను కేటాయించామని వివరించారు. మిగతా 56 దుకాణాలు జనరల్ కేటగిరీలో ఉంటాయని పేర్కొన్నారు. ప్రస్తుతం జారీ చేసే లైసన్సులు 2023 డిసెంబర్ 1నుంచి 2025 నవంబర్ 30వరకు అమల్లో ఉంటాయని వెల్లడించారు. మద్యం దుకాణాలకోసం దరఖాస్తుతో పాటు రూ.2లక్షలు (నాన్‌రిఫండబుల్) డీడీ లేదా చలాన్ రూపంలో చెల్లించాల్సి ఉంటుందన్నారు.

21న ఎంపిక ప్రక్రియ

జిల్లాలో మద్యం దుకాణాల లైసన్సు కోసం దరఖాస్తులను ఈనెల 18వరకు స్వీకరిస్తామని ఈఎస్ మహిపాల్‌రెడ్డి తెలిపారు. పెద్దపల్లి బస్టాండ్ వద్ద గల ప్రభుత్వ ఐటీఐ (పాత కలెక్టరేట్) ఆవరణలో శుక్రవారం నుంచే దరఖాస్తుల స్వీకరణ మొదలైందని పేర్కొన్నారు. తొలి రోజు 4 దరఖాస్తులు (పెద్దపల్లి–2, మంథని–2) వచ్చినట్లు వివరించారు. ఈనెల 21న బందంపల్లి స్వరూపగార్డెన్‌లో ఎంపిక ప్రక్రియ ఉంటుందని పేర్కొన్నారు. జిల్లాలో గతంలో ఉన్నట్టే ఈ సారి 77 దుకాణాలకే అనుమతినిస్తున్నట్లు తెలిపారు. గతంలో 77 దుకాణాలకు 1,080 దరఖాస్తులు వచ్చాయని వివరించారు. ఆయన వెంట సీఐలు శ్రీనివాస్, రమేశ్ తదితరులు ఉన్నారు.

బీసీ పథకం వర్తింపజేయాలి



ధర్నా నిర్వహిస్తున్న గౌడసంఘం నాయకులు

పాలకుర్తి(రామగుండం): రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బీసీబంధు పథకంలో గౌడకులాన్ని చేర్చాలని లేకుంటే ప్రభుత్వంపై తిరుగుబాటు తప్పదని సర్వాయి పాపన్న మోకుదెబ్బ గౌడ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాగిరి అంజిగౌడ్ అన్నారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట మండల అధ్యక్షుడు తోడేటి సదానందం ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నా కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. గౌడ సమాజంపై రాష్ట్ర ప్రభుత్వం సవతి తల్లి ప్రేమ చూపిస్తున్నదని,కల్లుగీత కార్మికులను రూ.లక్ష సాయం పథకంలో చేర్చకపోవడమే ఇందుకు నిదర్శనం అన్నారు. రాష్ట్ర సాధనలో కీలకపాత్ర పోషించిన గౌడ సమాజాన్ని బీఆర్‌ఎస్ ప్రభుత్వం విస్మరిస్తే భవిష్యత్‌లో తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్ జ్యోతికి వినతిపత్రం సమర్పించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు వేగోలపు శంకర్‌గౌడ్, నాయకులు ఏగోలపు సదయ్యగౌడ్, ఇల్లందుల అంజిబాబు, పల్లెర్ల శారద, వెంగలి రాజాగౌడ్, విష్ణువర్ధన్, గండి మమత, కవిత, అఖిలేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఇన్నోవేషన్ పోటీల్లో పాల్గొనాలి

పెద్దపల్లిరూరల్: జిల్లాలో ప్రస్తుత విద్యాసంవత్సరంలో నిర్వహిస్తున్న ఇంటింటా ఇన్నోవేషన్ పోటీల్లో యువత పాల్గొనేందుకు ముందుకు రావాలని డీఈవో మాధవి కోరారు. ట్రినిటి డిగ్రీ కాలేజీలో శుక్రవారం ఉపాధ్యాయులు, అధ్యాపకులకు నామినేషన్ల ప్రక్రియపై అవగాహన కల్పించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు ఏటా ఇన్‌స్పైర్ అవార్డు, మనక్ పోటీలను నిర్వహిస్తున్నారని వివరించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తుల నమోదుకు ఈనెల 31 తుదిగడువు ఉందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంత యువత ఇంటింటా ఇన్నోవేషన్ ఆవిష్కరణలను ఈనెల 10లోగా సెల్ 91006 78543 నంబరుకు పంపాలని కోరారు. వినూత్న ఆవిష్కరణల వివరాలను సురేందర్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. జిల్లా సైన్స్ అధికారి రవినందన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బిడ్డకు తల్లి పాలు శ్రేష్ఠం


మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో కృపాబాయి

కోల్‌సిటీ(రామగుండం): బిడ్డకు తల్లిపాలు శ్రేష్ఠమని, బిడ్డ పుట్టగానే తల్లులు ముర్రపాలు తప్పకుండా పట్టించాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ కృపాబాయి అన్నారు. గోదావరిఖనిలోని జీజీహెచ్ ప్రభుత్వ ఆస్పత్రిలో శుక్రవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ, ఆస్పత్రి సూపరింటెండెంట్ దయాల్‌సింగ్, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ హిమబిందుసింగ్ తదితర ప్రముఖ వైద్యులు తల్లిపాల ప్రాముఖ్యతపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. అనంతరం పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. లయన్స్ క్లబ్ ప్రతినిధులు కళాంపురం జయప్రద, బంక కళావతి, వైద్యులు శ్రీదేవి, శిరీష, అశోక్, శ్రీలత, మేడిశెట్టి గంగాధర్, బంక రామస్వామి, తిలక్ చక్రవర్తి, లక్కం భిక్షపతి తదితరులున్నారు. అలాగే లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు తానిపర్తి విజయలక్ష్మి, సీనియర్ ప్రతినిధి రమాపతి జన్మదిన వేడుకలను పురస్కరించుకొని పండ్లు పంపిణీ, అన్నదానం చేశారు.

పొత్కపల్లి ఠాణా తనిఖీ


రికార్డులు పరిశీలిస్తున్న ఏసీపీ మహేశ్

ఓదెల(పెద్దపల్లి): పోలీస్‌స్టేషన్‌లలో ఫ్రెండ్లీ పోలీసింగ్‌ను విజయవంతం చేయాలని పెద్దపల్లి ఏసీపీ మహేశ్ పేర్కొన్నారు. శుక్రవారం పొత్కపల్లి ఠాణాను ఆకస్మికంగా తనిఖీ చేశారు. నమోదైన, పెండింగ్ కేసుల వివరాలను తెలుసుకున్నారు. స్టేషన్ పరిధిలోని సమస్యాత్మక గ్రామాల్లో రాత్రిపూట గస్తీ ముమ్మరం చేయాలన్నారు. ఠాణాకు వచ్చేవారితో మర్యాదగా ప్రవర్తించాలని సూచించారు. ఆయన వెంట సుల్తానాబాద్ సీఐ జగదీశ్, పొత్కపల్లి ఎస్సై శ్రీధర్ ఉన్నారు.

విజయవంతం చేయాలి

ఓదెల(పెద్దపల్లి): హరితహారం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డీఆర్డీఏ పీడీ సత్యనారాయణ అన్నారు. శుక్రవారం ఓదెల మండలపరిషత్ కార్యాలయంలో మాట్లాడారు. గ్రామాల్లో మొక్కలు నాటేందుకు సన్నద్ధం కావాలన్నారు. ఎంపీడీవో జి.సత్తయ్య, ఏపీఎం రమేశ్, టీఏ శ్వేత, ఎంపీవో వాజీద్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

ధర్మపురి : రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఒకరికి తీవ్ర గాయాలుకాగా మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి. ఏఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం .. ధర్మపురి శివారులోని దమ్మన్నపేట వెళ్లే రోడ్డులో శుక్రవారం ఎదురెదురుగా రెండు బైకులు ఢీకొనడంతో మండలంలోని జైనా గ్రామానికి చెందిన గుర్రాల లక్ష్మణ్‌కు తీవ్ర గాయాలుకాగా చిన్న నక్కలపేట గ్రామానికి చెందిన కామెర కల్యాణ్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఇద్దరిని చికిత్స కోసం జగిత్యాల ఏరియా ఆస్పత్రికి తరలించగా లక్ష్మణ్‌ను మెరుగైన వైద్యంకోసం కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

మహిళా పోలీసులు సమర్థవంతంగా పనిచేయాలి

- రామగుండం సీపీ రెమా రాజేశ్వరి


సమావేశంలో మాట్లాడుతున్న రెమా రాజేశ్వరి


ఉల్లాసంగా మహిళా పోలీసులు

గోదావరిఖని: మహిళా పోలీసులు సమర్థవంతంగా పనిచేయాలని రామగుండం సీపీ రెమా రాజేశ్వరి పేర్కొన్నారు. కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల జిల్లాలో పనిచేస్తున్న మహిళా హోంగార్డు నుంచి ఎస్సై స్థాయి అధికారులకు శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. నాయకత్వ లక్షణాలు, వర్క్‌లైఫ్ బ్యాలెన్స్, స్ట్రెస్ మేనేజ్మెంట్, ఓవరాల్ వెల్నెస్‌పై చిందు హైదరాబాద్ సంస్థకు చెందిన సబ్రినా, సురేశ్, సారిక, శిరీష శిక్షణ బృందం అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం మహిళా ఉద్యోగులను పెంచేందుకు 33 శాతం రిజర్వేషన్ కల్పించిందని తెలిపారు. మహిళా ఉద్యోగులు నిత్య జీవితంలో ఉద్యోగం వ్యక్తిగత విషయాలు, కుటుంబ బాధ్యతలు, వృత్తిపరంగా సామర్థ్యం, గుర్తింపు పెంచుకోవడం సవాలేనన్నారు. రెండింటిని సమన్వయం చేసుకునేందుకు ఒత్తిడికి గురవుతుంటారని, ప్రణాళిక బద్ధంగా ముందుకుకెళ్తే కష్టమేమీ కాదని పేర్కొన్నారు. మహిళా ఉద్యోగులు ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మంచిర్యాల డీసీపీ సుధీర్ కేకెన్, ఏసీపీలు తిరుపతి రెడ్డి, మోహన్, సదయ్య, వెంకటేశ్వర్లు, మల్లారెడ్డి, నరసింహులు, సుందర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ హయాంలోనే సంక్షేమ పాలన


పార్టీలోకి ఆహ్వానిస్తున్న రేవంత్‌రెడ్డి

పెద్దపల్లి రూరల్: కాంగ్రెస్ పార్టీ హయాంలోనే అన్నివర్గాలకు సంక్షేమ ఫలాలు అందాయని మాజీ ఎమ్మెల్యే విజయరమణా రావు అన్నారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌కు చెందిన మాజీ ఎమ్మెల్యే బిరుదు రాజమల్లు, మున్సిపల్ మాజీ చైర్మన్ ఎల్.రాజయ్య, నాయకులు గంట రమేశ్, ముదుసు సాంబిరెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు విజయరమణారావు సారథ్యంలో శుక్రవారం కాంగ్రెస్‌లో చేరారు. హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో రేవంత్‌రెడ్డి కండువా కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపునకు కృషిచేస్తామని బిరుదు రాజమల్లు, ఎల్. రాజయ్య పేర్కొన్నారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు ఠాకూర్ మక్కాన్‌సింగ్‌తో పాటు సుల్తానాబాద్ మున్సిపల్ వైస్ చైర్మన్ బిరుదు సమత కృష్ణ, పూదరి మహేందర్, వామన్‌రావు, రామస్వామి, తదితరులున్నారు.

హైదరాబాద్‌కు తరలిన నాయకులు

సుల్తానాబాద్: టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు ఆధ్వర్యంలో పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే బిరుదు రాజమల్లు, మున్సిపల్ మాజీ చైర్మన్ ఎల్.రాజయ్య, ప్రజాప్రతినిధులు హైదరాబాద్‌కు తరలివెళ్లారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు పెద్దఎత్తున తరలివెళ్లగా మాజీ ఎమ్మెల్యే బిరుదు రాజమల్లు కాంగ్రెస్ జెండాను కాన్వాయ్‌ను ప్రారంభించారు.

అద్దె వాహనాల బిల్లులు త్వరగా చెల్లించాలి


సింగరేణి డైరెక్టర్(పా)కు వినతిపత్రం ఇస్తున్న జెడ్పీ చైర్మన్ పుట్ట మధు, తదితరులు

గోదావరిఖని(రామగుండం)/మంథని: సింగరేణిలో అద్దె వాహనాల యజమానుల సమస్యలను పరిష్కరించి వెంటనే బిల్లులు మంజూరు చేయాలని బాధితులు కోరారు. శుక్రవారం సింగరేణి భూనిర్వాసిత అద్దెవాహనాల యజమానులు జెడ్పీ చైర్మన్ పుట్ట మధుతో కలిసి హైదరాబాద్‌లో డైరెక్టర్(పా) బలరాంకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా పలు సమస్యలను విన్నవించారు. నిరుద్యోగులకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా సంస్థ కేటాయించిన వాహనాల నడపడం వల్ల ఆర్థికంగా నష్టపోతున్నామన్నారు. రెండు నెలల బిల్లులు నిలిచిపోవడంతో వాహనాల్లో డీజిల్ పోయించుకునేందుకు కూడా పైసలు లేవని వాపోయారు. అద్దె వాహనాల యూనిట్ రేట్ పెంచాలనే తదితర డిమాండ్లను వివరించారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెంగర్ల మల్లయ్య, అసోసియేషన్ అధ్యక్షుడు సుందిళ్ల నాగరాజు తదితరులున్నారు.

సమాచారం ఇవ్వడంలో జాప్యం

కమాన్‌పూర్: ఆర్జీ–3 డివిజన్ పరిధిలోని ఓసీపీ–2లో ఓబీ పనులు నిర్వహిస్తున్న సీ–5 ప్రైవేటు కంపెనీకి సంబంధించిన వివరాలు ఇవ్వాలని సమాచార హక్కు చట్టం ద్వారా దరఖాస్తు చేసినా సింగరేణి అధికారులు ఎందుకు జాప్యం చేస్తున్నారని మంథని బ్లాక్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు తొట్ల తిరుపతి యాదవ్ శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఐదునెలల నుంచి నిబంధనలకు విరుద్ధంగా ఓబీ పనులు నిర్వహిస్తున్నారని, అందుకు సమాచారం ఇవ్వాలని సింగరేణి సంస్థకు లిఖితపూర్వంగా దరఖాస్తు చేసినట్లు చెప్పారు. అధికారులు జాప్యం చేయడంలో అంతర్యం ఏంటన్నారు. అగ్రిమెంట్‌కు విరుద్ధంగా సింగరేణి సంస్థ ఓబీ కంపెనీకి బిల్లు చెల్లిస్తోందని, అందుకే సమాచారం ఇవ్వడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు.

కారు, ఆర్టీసీ బస్సు ఢీ..

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి పట్టణంలోని ప్రగతినగర్ సమీపంలో ఆర్టీసీ బస్సు, కారు ఢీకొంది. వివరాల్లోకి వెళ్తే.. ప్రగతినగర్ సమీపంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో పిల్లల్ని దింపేందుకు కారులో వెళ్తున్న ఓ వ్యక్తి కారును ఆర్టీసీ బస్సు ఢీకొంది. కారు యజమాని ఆర్టీసీ కండక్టర్‌పై చేయిచేసుకోగా కొంతసేపు ఉద్రిక్తత చోటు చేసుకున్నట్లు సమాచారం. స్థానికులు ఇరువురికి సర్దిచెప్పి రాజీ కుదిర్చినట్లు తెలిసింది. ఈ విషయమై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై మహేందర్ తెలిపారు.

వృద్ధుడి ఆత్మహత్య

కథలాపూర్(వేములవాడ): బీమారం మండలం ఈదుల లింగంపేటకు చెందిన ఇట్టెడి లింగారెడ్డి (80) అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. లింగారెడ్డి కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. పలు ఆస్పత్రులు తిరిగినా నయం కాకపోవడంతో ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య గంగవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై హసన్ మహ్మద్ తెలిపారు.

కాపర్ వైర్ చోరీ

ఇబ్రహీంపట్నం : మండలంలోని గొ. దూర్ గ్రామ శివారులో గుర్తు తెలియని వ్యక్తులు ట్రాన్స్‌ఫార్మర్ నుంచి కాపర్‌వైర్‌ను ఎత్తుకెళ్లినట్లు ట్రాన్స్‌కో ఏఈ సతీశ్ శుక్రవారం తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

పెద్దపల్లి రూరల్: పెద్దపల్లి మండలంలోని భోజన్నపేట శివారు హుస్సేన్ మియావాగు వద్ద ఉన్న వ్యవసాయ బావి వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. సుమారు 35 నుంచి 40 ఏళ్ల మధ్య వయస్సు ఉన్నట్లు తెలిపారు. ఎస్సై మహేందర్ తెలిపారు. వివరాలకు 87125 56506, 87125 56507 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ధాన్యం పట్టివేత


అధికారులు స్వాధీనం చేసుకున్న ధాన్యం

సుల్తానాబాద్‌రూరల్: రైస్‌మిల్ నుంచి ధాన్యాన్ని అక్రమంగా తరలిస్తున్న లారీని శుక్రవారం రాత్రి సివిల్ సప్లై అధికారులు పట్టుకొని సీజ్‌చేశారు. సివిల్ సప్లై ఉప తహసీల్దార్ శంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కాట్నపల్లి పరిధిలోని సిరి రైస్‌మిల్‌కు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేసి మార పట్టించి ఇచ్చేందుకు ధాన్యాన్ని కేటాయించారు. రైస్‌మిల్ యజమాని ఎలాంటి అనుమతి లేకుండా హుజూరాబాద్‌కు ఓ ట్రేడ్ లైసెన్స్ హోల్డర్ ద్వారా ఏపీ 24వై 4530గల లారీలో దాదాపు 27క్వింటాళ్ల ధాన్యాన్ని తరలిస్తుండగా పట్టుకొని సీజ్ చేసినట్లు తెలిపారు. ఉన్నతాధికారులకు నివేదికను అందించనున్నట్లు చెప్పారు. ఇక్కడ సివిల్ సప్లై అధికారి రవీందర్, తదితరులున్నారు.

గుండెపోటుతో కాంట్రాక్ట్ కార్మికుడి మృతి


జయచంద్ర రెడ్డి (ఫైల్)

జ్యోతినగర్: గుండెపోటుతో ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్ట్ కాంట్రాక్ట్ కార్మికుడు జయచంద్ర రెడ్డి (49) మృతిచెందాడు. వివరాలిలా వివరాల్లోకి వెళ్తే.. అన్నపూర్ణ కాలనీకి చెందిన జయచంద్ర రెడ్డి ఎన్టీపీసీ రామగుండం ప్లాంటులో ఏసీ ప్లాంట్ విభాగంలో కాంట్రాక్టు కార్మికుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. గురువారం రాత్రి ఛాతిలో నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు గోదావరిఖని ప్రభుత్వ ప్రాంతీయ ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ గుండెపోటుతో మృతిచెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

స్వాతంత్య్ర వేడుకలను ఘనంగా నిర్వహించాలి


సమావేశంలో పాల్గొన్న అధికారులు

కమాన్‌పూర్: ఆర్జీ–3 ఏరియాలో స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని ఆర్జీ–3, ఏపీఏ జీఎంలు ఎన్. సుధాకర్‌రావు, కె.వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎంలు మాట్లాడుతూ.. ఈనెల15న అన్ని గనులు, డిపార్ట్‌మెంట్లలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం జీఎం కార్యాలయంలో వేడుకలకు హాజరుకావాలన్నారు. సమావేశంలో అధికారులు రఘుపతి, ఎలీషా, జైనుల్లా బద్దీన్, చంద్రశేఖర్, కర్ణ, పద్మరాజు, రవీందర్ రెడ్డి, ఐలయ్య, శ్రావణ్‌కుమార్, మారుతి, శ్రీహరి, హరీశ్, మురళి, సాయికృష్ణలు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి



మాట్లాడుతున్న జనక్ ప్రసాద్

పాలకుర్తి: రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్ డిమాండ్ చేశారు. శుక్రవారం బసంత్‌నగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో ఈఎస్‌ఐ ఆస్పత్రిని నిర్మించలేదని, కేంద్ర ప్రభుత్వం వంద పడకల ఆస్పత్రి నిర్మాణానికి నిధులు కేటాయించినా ప్రభుత్వం స్థల సేకరణ చేపట్టకపోవడం సిగ్గుచేటన్నారు. అంతర్గాం, పాలకుర్తి మండలాల పరిధిలో సున్నపు రాయి గనులు నిక్షేపాలు పుష్కలంగా ఉన్నాయని, కాంగ్రెస్ పార్టీకి అవకాశం కల్పిస్తే సింగరేణి యాజమాన్యంతో మాట్లాడి మరో రెండు సిమెంట్ కర్మాగారాల ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. కేశోరాం కాంట్రాక్ట్ కార్మిక సంఘం అధ్యక్షుడు సూర సమ్మయ్య, ప్రధాన కార్యదర్శి అంజయ్య, నరసింహరెడ్డి, ధర్మపురి లక్ష్మీపతి, దాస్, వికాస్‌కుమార్ యాదవ్, శంకర్, అల్లావుద్దీన్, శంకర్, రాజేశం, పోశమల్లు, తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనం అమలు చేయాలి

గ్రామ పంచాయతీ కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో జీపీ కార్మికులు చేస్తున్న నిరవధిక సమ్మెకు సంఘీభావం ప్రకటించారు. దీక్షా శిబిరంలో పాల్గొన్న కార్మికుల భోజనాల కోసం ఆర్థిక సాయం అందజేశారు. నాయకులు నర్సింహారెడ్డి, దాస్, ధర్మపురి లక్ష్మీపతి గౌడ్, వికాస్‌కుమార్, అల్లావుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

కరపత్రం ఆవిష్కరణ


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులుల

పెద్దపల్లిరూరల్: క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో పోరాటం కొనసాగించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యం రావు అన్నారు. ఈనెల 9,10వ తేదీల్లో జిల్లాకేంద్రంలో తలపెట్టిన మహాధర్నా కరపత్రాన్ని శుక్రవారం బస్టాండ్ సమీపంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఆవిష్కరించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, ప్రభుత్వ రంగ సంస్థలు, వ్యవసాయ భూములను కార్పొరేట్ సంస్థలకు అమ్ముకుంటోందని ఆరోపించారు. దేశ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసే విధానాలను అనుసరించడాన్ని నిరసిస్తూ పోరాటాలను చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ×క్విట్ మోదీ, సేవ్ ఇండియా× నినాదంతో ఈనెల 9,10వ తేదీల్లో దేశవ్యాప్తంగా మహా పడావ్ నిర్వహించనున్నారని, జిల్లా కేంద్రంలో 9న, 10 గోదావరిఖనిలో మహాధర్నా నిర్వహిస్తున్నామన్నారు. ధర్నాలో కార్మికులు, ఉద్యోగులు, రైతులు, మహిళలు పెద్దఎత్తున పాల్గొనాలన్నారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి జి. జ్యోతి, నాయకులు తాండ్ర అంజయ్య, మామిడిపల్లి తిరుపతి, లక్ష్మి, అశోక్, ముస్తఫా, రాజలింగు, తదితరులు పాల్గొన్నారు.

సెకండ్ ఏఎన్‌ఎంలను రెగ్యులరైజ్ చేయాలి



సుల్తానాబాద్‌లో నిరసన తెలుపుతున్న ఏఎన్‌ఎంలు, సునీల్

సుల్తానాబాద్: సెకండ్ ఏఎన్‌ఎంలను వెంటనే రెగ్యులరైజ్ చేసి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి సునీల్ డిమాండ్ చేశారు. సెకండ్ ఏఎన్‌ఎంల అక్రమంగా అరెస్టు చేయడాన్ని ఖండించారు. సుల్తానాబాద్‌లో సెకండ్ ఏఎన్‌ఎంలతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం 2018 జూలై 26న నోటిఫికేషన్ విడుదల చేసిందని, 30 మార్కుల వెయిటేజ్ ఇచ్చి 20 మార్కులకు కుదించడం ఏమిటన్నారు. అక్రమ అరెస్టులతో పోరాటాలు ఆపలేరని, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు.

సేవ చేయడంలోనే సంతృప్తి


ఆర్థికసాయం అందజేస్తున్న బాబర్ సలీంపాషా

జ్యోతినగర్: సేవ చేయడంలోనే నిజమైన సంతృప్తి లభిస్తుందని ఐఎన్టీయూసీ జాతీయ సీనియర్ కార్యదర్శి బాబర్ సలీంపాషా అన్నారు. ఎన్టీపీసీ రామగుండం ఎఫ్‌సీఐ క్రాస్ రోడ్డులోని ఆటో యూనియన్‌కు చెందిన కోశాధికారి ఎల్లె శ్రీనివాస్ కుమార్తె అనారోగ్యంతో చికిత్స పొందుతోంది. యూనియన్ గౌరవాధ్యక్షుడు బాబర్ సలీంపాషా, ఆటో డ్రైవర్లు, యజమానులు రూ.11వేలతోపాటు బాబర్ సలీంపాషా తనవంతుగా రూ.5వేలు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు ఓలపు రాజయ్య, ప్రధాన కార్యదర్శి పూజారి రవి గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

లాభాల వాటా చెల్లించాలి


జీఎంకు వినతిపత్రం అందజేస్తున్న టీఎన్‌టీయూసీ నాయకులు

గోదావరిఖని: సింగరేణి సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు లాభాల వాటా చెల్లించాలని టీఎన్‌టీయూసీ నాయకులు కోరారు. శుక్రవారం ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. సంస్థ వ్యాప్తంగా 30వేల పైచిలుకు కాంట్రాక్టు కార్మికులుగా పనిచేస్తున్నారని, పర్మినెంట్ కార్మికులతో సమానంగా వారికి లాభాల వాటా చెల్లించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు నిమ్మకాయల ఏడుకొండలు, మణిరామ్ సింగ్, పెగడపెల్లి రాజనర్సు, కామెర రాజబాబు, బి.వీరేందర్, తదితరులు పాల్గొన్నారు.

ఓబీ తొలగింపు పనులు వేగవంతం చేయాలి


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఆర్జీ–1 జీఎం శ్రీనివాస్

గోదావరిఖని: సంస్థ వ్యాప్తంగా ఉన్న ఓసీపీల్లో ఓబీ తొలగింపు పనులు వేగవంతం చేయాలని సింగరేణి డైరెక్టర్లు ఎన్వీకే శ్రీనివాస్, జి.వెంకటేశ్వర్ రెడ్డి సూచించారు. శుక్రవారం సంస్థ వ్యాప్తంగా ఉన్న అన్ని ఏరియాల జీఎంలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జీడీకే 5 ఓపెన్‌కాస్ట్‌లో ఓవర్ బర్డెన్ తొలగింపు పనులకు సంబంధించి కాంట్రాక్టర్ చేపడుతున్న పనులను అడిగి తెలుసుకున్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్, గ్రూప్ ఏజెంట్ చిలక శ్రీనివాస్, ప్రాజెక్ట్ అధికారి చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికులను క్రమబద్ధీకరించాలి


సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

గోదావరిఖని: రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి ఎ.వెంకన్న డిమాండ్ చేశారు. శుక్రవారం యూనియన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న సుమారు రెండు లక్షల 25 వేల మంది కాంట్రాక్టు కార్మికులు పని చేస్తున్నారన్నారు. సమావేశంలో నాయకులు నరేశ్, బి.అశోక్, చిలుక శంకర్, ఎం.దుర్గయ్య, రామ్‌కి, శ్రీకాంత్, నవీన్ పాల్గొన్నారు.